## సీఎంఆర్ బియ్యాన్ని నెలాఖరులోగా డెలివరీ ఇవ్వాలి

**రైస్ మిల్లులను పూర్తి సామర్థ్యంతో నిర్వహించి ఉత్పత్తిలో వేగం పెంచాలి**

**సీఎంఆర్ డెలివరీలో లక్ష్యం చేరని మిల్లర్లను బ్లాక్ లిస్ట్‌లో ఉంచుతాం**

**రైస్ మిల్లుల తనిఖీలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్**



ఖమ్మం రూరల్‌లోని రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఖమ్మం రూరల్, జనవరి 28: సీఎంఆర్ రైస్ డెలివరీకి ప్రభుత్వం ఈ నెల 31 వరకు గడువు ఇచ్చిందని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ అన్నారు. అందుకని ప్రభుత్వ లక్ష్యం మేరకు మిల్లర్లందరూ సీఎంఆర్ రైస్ డెలివరీని ఆ గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంలోని సత్యనారాయణ సిల్కి అండ్ సార్టెక్స్ రైస్ మిల్లును ఆదివారం ఆయన తనిఖీ చేశారు. వానకాలం సీఎంఆర్ రైస్ డెలివరీ, కేటాయించిన లక్ష్యం, అందించిన రైస్ వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లులు పూర్తి సామర్థ్యం మేర నిర్వహించి రైస్ ఉత్పత్తిలో వేగం పెంచి లక్ష్యం మేరకు సీఎంఆర్ రైస్ డెలివరీ చేయాలని ఆదేశించారు. నిర్దేశిత సమయంలో లక్ష్యాలు చేరుకోని రైస్ మిల్లులపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వానకాలం పంటకు సంబంధించిన పెండింగ్ ఉన్న సీఎంఆర్ రైస్ డెలీవరి దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీఎంఆర్ రైస్ డెలివరీకి ఇకపై గడువు పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇంకా 3,354.577 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ డెలివరీ చేయాల్సి ఉందన్నారు. లక్ష్యం చేరని మిల్లర్లను బ్లాక్ లిస్ట్‌లో ఉంచుతామని హెచ్చరించారు.

## భద్రగిరికి పోటెత్తిన భక్తులు

- అర్ధరాత్రి వరకు స్వామివారి దర్శన భాగ్యం
- భక్తుల తాకిడితో ఆర్జిత సేవలు నిలిపివేత



రామయ్య దర్శనం కోసం లైన్లలో వేచి ఉన్న భక్తులు

భద్రాచలం, జనవరి 28: భద్రగిరికి భక్తులు పోటెత్తారు. మూడు రోజులుగా భద్రాచలం రామాలయానికి భక్తుల తాకిడి పెరిగింది. శుక్రవారం రిపబ్లిక్ డే, శని, ఆదివారాలు వారాంతపు సెలవులు కావడంతో రద్దీ కనిపించింది. కొందరు భక్తులు ముందుగా ములుగు జిల్లాలోని మేడారంలో సమ్మక్క, సారక్కను దర్శించుకుని భద్రాద్రి రామయ్య దర్శనానికి వస్తున్నారు. తర్వాత పాపికొండల విహార యాత్రకు వెళుతున్నారు. శనివారం ఆలయ సన్నిధిలో జరిగిన రామయ్య నిత్యకల్యాణ క్రతువుకు రికార్డు స్థాయిలో 219 దంపతుల జంటలు విచ్చేశారు. భక్తుల తాకిడి పెరగడంతో ఆలయ అధికారులు ఒక దశలో ఆర్జిత సేవలను సైతం రద్దు చేశారు. రాత్రి 10:30 గంటల వరకు భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కలిగింది. ఆదివారమూ ఆర్జిత సేవల రద్దు కొనసాగింది. భక్తుల రద్దీ కూడా కనిపించింది. రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

**అల్పాహారం, భోజన వసతికి కటకట..**

భద్రాచలం పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో శనివారం విధ్వంసం జరిగింది. దీంతో పట్టణంలో బంద్ కొనసాగింది. దీంతో హోటల్స్ సైతం మూతపడ్డాయి. భక్తులు అల్పాహారం, భోజనం దొరక్క ఇబ్బందులు పడ్డారు. మరోవైపు భక్తులు రవాణా ఇబ్బందులూ ఎదుర్కొన్నారు. ప్రైవేటు వాహన యజమానులు సాధారణ రేట్లకంటే అధికంగా భక్తుల నుంచి వసూలు చేశారు.

**'పాపికొండల' యాత్రికులకు చేదు అనుభవం..**

భద్రాచలం నుంచి పాపికొండల యాత్రకు వెళ్లిన యాత్రికులకు శనివారం చేదు అనుభవం ఎదురైంది. యాత్రికులు ముందుగానే విహార యాత్ర టిక్కెట్లు కొనుగోలు చేసినప్పటికీ నిర్వాహకులు ఏపీలోని పోచవరం పాయింట్ వద్ద బోట్లు ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో వ్యయప్రయాసలకోర్చి వెళ్లిన యాత్రికులు నిరాశ చెందారు. మధ్యాహ్నం వరకు అక్కడే ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. దీంతో అక్కడి నుంచి బస్సుల్లో తిరుగుప్రయాణమై అర్ధరాత్రి భద్రాచలం పట్టణానికి చేరుకున్నారు.

## ఉర్సు ఉత్సవాల్లో మంత్రి తుమ్మల



చాదర్ సమర్పిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, జనవరి 28: ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్ బండ్ హజ్రత్ సయ్యద్ యాకూబ్ పావలీ దర్గాహ్‌లో ఆదివారం ఉర్సు ఉత్సవాలు జరిగాయి. ఈ ఆధ్యాత్మిక ఉత్సవానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థన చేశారు. కార్యక్రమంలో దర్గా ముజవార్ షేక్ హబీబున్, నిర్వాహకులు సల్మాన్, సాహెబ్, హుస్సేన్, నాగుల్ మీరా, ఖాజామియా, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆస్రిఫ్, ఖదీర్, జాకీర్, నవాజ్, షబ్బీర్, సోహెల్ పాల్గొన్నారు.

## ఓటు నమోదు మందకొడి..
# కాస్త పట్టించుకోండి!

- పట్టభద్రులకు 'ఆన్‌లైన్' ఇబ్బందులు
- ఎప్పుడు పోర్టల్ తెరుచుకుంటుందా.. అని ఎదురుచూపులు
- భద్రాద్రి జిల్లాలో 55 వేల మందికి పైగా ఓటర్లు
- ఇప్పటివరకు 13,365 మంది మాత్రమే నమోదు
- వాటిపైనా బీఎల్వోల వెరిఫికేషన్ సో..సో..!
- అధికారులు చొరవ చూపి ప్రక్రియ పూర్తి చేయాలని ఓటర్ల డిమాండ్





కొత్తగూడెంలో ఓటు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారి (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియకు ఆన్‌లైన్ సర్వర్స్ సహకరించడం లేదు. పోర్టల్ ఎప్పుడు తెరుచుకుంటుందో తెలియదు. ఎప్పుడు తెరుచుకోదో తెలియక పట్టభద్రులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఓటు నమోదు ప్రక్రియ భద్రాద్రి జిల్లాలో మందకొడిగా సాగుతున్నది. గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో జిల్లావ్యాప్తంగా 44 వేల మంది పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. వీరంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో డిగ్రీ పూర్తి చేసిన వారి సంఖ్య 55 వేలకు పైగా చేరింది. వీరిలో కేవలం 13,365 మంది మాత్రమే ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నట్లు సమాచారం. ఆన్‌లైన్ చేసుకున్న ఓటర్ల వద్దకు బీఎల్వోలు వెరిఫికేషన్‌కు రాకపోవడంతో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు తమకు ఓటు హక్కు వస్తుందా.. రాదా.. అనే సందిగ్ధంలో ఉన్నారు.

**పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ నమోదు..**

జిల్లాలో డిగ్రీ పూర్తి చేసిన వారు 55 వేల మందికి పైగా ఇప్పటివరకు సగమంది కూడా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోలేదని తెలుస్తున్నది. యంత్రాంగం అంతంతమాత్రంగా ప్రచారం చేయడం, ఆన్‌లైన్‌లో టెక్నికల్ సమస్యలకు పరిష్కారం చూపకపోవడంతోనే ఈ సమస్య అని వేరే చెప్పనక్కర్లేదు. జిల్లాలో ఎక్కువ పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ ఓటు నమోదు ప్రక్రియ కనిపిస్తున్నది. అత్యధికంగా ఇల్లెందు మండలం నుంచి 1,397 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత స్థానంలో పాల్వంచ, కొత్తగూడెం మండలాలు నిలిచాయి. పాల్వంచ మండలం నుంచి 1,389 మంది, కొత్తగూడెం మండలం నుంచి 1,333 మంది దరఖాస్తు చేసుకున్నారు. మిగతా ఏజెన్సీ మండలాల్లో ఓటు నమోదు అంతంతమాత్రమే నమోదు.

**స్పష్టంగా కనిపిస్తున్న అలసత్వం..**

ఓటు హక్కు కోసం నమోదు చేసుకునే వారికి ఆన్‌లైన్ ఇబ్బందులు తప్పడం లేదు. ఆన్‌లైన్‌లో పోర్టల్ ఓపెన్ కాకపోవడంతోనే ఈ ఇబ్బందులు. సమస్యను అధికారులూ పట్టించుకోకపోవడంతో ఓటు నమోదు ప్రక్రియ ముందుకు కదలడం లేదు. దీంతో పట్టభద్రులు కూడా ఓటు నమోదు చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని ఓటర్లు కోరుతున్నారు.

**6న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల..**

ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నిలకు ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతుంది. అది పూర్తయిన తర్వాత యంత్రాంగం వచ్చే నెల 6న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. అప్పటి కల్లా ఓటరు నమోదు ప్రక్రియక పూర్తి కాకపోతే ఏప్రిల్ 24న ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. ఈ లోపు పట్టభద్రులు ఓటు కోసం నమోదు చేసుకోవాల్సిందే. లేకపోతే ఓటు హక్కు కోల్పోక తప్పదు.

### ఆన్‌లైన్ పోర్టల్ తెరుచుకోవడం లేదు



ఓటు నమోదు చేసుకునేందుకు నేను రెండు సార్లు ఆన్‌లైన్ సెంటర్‌కు వెళ్లాను. పోర్టల్ ఓపెన్ కాకపోవడంతో ఇబ్బంది పడ్డాను. గంటల కొద్దీ ఆన్‌లైన్ చేసేందుకు నేను ఎదురుచూశాను. చివరకు నాకు నిరాశే ఎదురైంది. ఆఫ్‌లైన్‌లో పత్రాలు ఇద్దామంటే స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. **– డి.రాధిక, ఓటర్, కొత్తగూడెం**

### గతంలో నమోదు చేసుకున్న వారూ మళ్లీ నమోదు చేసుకోవాలి..



గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వాళ్లు కూడా మళ్లీ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలి. ఈ విషయం తెలియక కొందరు నమోదు చేసుకోవడం లేదు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 12,365 మంది ఆన్‌లైన్‌లో ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారు. వాటిని బీఎల్వోలు పరిశీలిస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోని వారు మ్యానువల్‌గా పత్రాలను బీఎల్వోలకు ఇవ్వొచ్చు. బీఎల్వోలు ఆదివారమూ పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారు. సందేహాలేమైనా తలెత్తితే టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

**– ప్రియాంక ఆల, భద్రాద్రి కలెక్టర్**

